
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు 5

మంగళవారం 28 అక్టోబరు 2025



శ్రీగిరిలో కార్తీక శోభ 6



జిల్లా ఖ్యాతిని చాటిచెప్పేలా కర్నూలు ఉత్సవ్ 6



కర్నూలులో చివరి మజిలీ 7

నిబంధనలకు పాతర

కాస్తంత సుఖంగా ప్రయాణించాలని ఎవరైనా అనుకుంటారు. పది రూపాయలు ఎక్కువ ఖర్చు చేయగలవాళ్లు అందుకు తగిన సౌకర్యాలు కోరుకుంటారు. ప్రైవేట్ ట్రావెల్స్ బిజినెస్ అక్కడ మొదలవుతుంది. ఆకర్షణీయమైన హంగులు ఉండే ట్రావెల్స్ వేగంగా గమ్యం చేర్చుతాయనే నమ్మకం కూడా తోడైంది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ట్రావెల్స్ యజమానులు బస్సులు నడిపి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇటీవల కర్నూలు సమీపంలో జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం అనేక విషయాలను బయటపెట్టింది. ఈ సందర్భంగా కర్నూలు కేంద్రంగా నడిచే ట్రావెల్స్ బస్సుల లోగుట్టు ఇలా ఉంది...



తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

- ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్...
- మన రాష్ట్రం నుంచి ఆపరేషన్
- కర్నూలులోనూ ప్రైవేట్ ట్రావెల్స్ హవా
- రవాణా శాఖ అధికారుల దాడుల్లో పలు విషయాలు వెలుగులోకి

కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ హవా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. కర్నూలులో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం తర్వాత ప్రైవేట్ బస్సుల్లో ఎంత భద్రత ఉందనే కోణంలో చర్చ జరుగుతోంది. అసలు ఈ బస్సులకు ఎందుకింత డిమాండ్ ఉంది? బస్సులో ఉన్న సౌకర్యాలేమిటి? అనే కోణంలో సాధారణ ప్రజలు ఆరా తీస్తున్నారు. గత ఐదారేళ్లుగా ఈ ట్రావెల్స్ బిజినెస్ విపరీతంగా పెరిగింది. బెంగళూరు టూ హైదరాబాదు, అనంతపురం-కర్నూలు-విజయవాడ, ఆదోని- విజయవాడ, హైదరాబాదు-తిరుపతి ఇలా వందలాది ట్రావెల్ బస్సులు కర్నూలు మీదుగా ప్రయాణిస్తున్నాయి. రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు హైవేలో గమనిస్తే వీటి స్పీడ్ విపరీతంగా ఉంటుంది. పెద్ద పెద్ద బస్సులు కర్టన్లు, ఏసీ కూపేలతో, ఆకర్షణీయమైన బయట రంగులతో, బొమ్మలతో.. ఇలాంటి పెద్ద బస్సులో ఒక్కసారైనా ప్రయాణించాలని ఎవరైనా అనుకుంటారు. ఒక్కసారి ప్రయాణించాక.. అందులో ఉన్న సౌకర్యాలు, ఏసీ, కర్టన్లు, దుప్పటి, వాటర్‌బాటిళ్లకు ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ట్రావెల్స్ విపరీతంగా పెరిగాయి.



కేసుల వివరాలు ఇవి



- రికార్డులు లేనివి : 11
- ఎమర్జెన్సీ డోర్లు లేనివి : 01
- ఫైర్ సేఫ్టీ లేనివి : 9
- డ్రైవింగ్ లైసెన్సు లేని కేసు : 01
- ఓవర్ స్పీడ్ : 3
- నో రిఫ్లెక్టర్స్ : 4
- ఫిట్‌నెస్ లేని వాహనాలు : 2
- వాణిజ్య సరుకులు రవాణా వాహనాలపై : 33
- లైటింగ్ ఫోక్స్ అధికంగా ఉన్నవి : 54
- పర్మిట్లు లేని వాహనాలు : 8
- విండ్ షీల్డ్ లేనివి : 23
- ట్యాక్స్ చెల్లించని వాహనాలు : 15

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కడ రిజిస్ట్రేషన్ జరిగినా ఫిజికల్ వెరిఫికేషన్ ఉంటుంది. నిబంధనలకు అనుగుణంగా కంపెనీ మాన్యువల్‌లో రూపొందించి ఉంటేనే బస్సు రిజిస్ట్రేషన్ జరుగుతుంది. మరో వైపు అన్ని నిబంధనల ప్రకారం ఉంటే .. ఇక్కడ ట్రావెల్స్ నడపాలంటే ఒక్కో సీటుకు రూ.4వేల చొప్పున ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ రూపంలో చెల్లించాలి.. ఇది ట్రావెల్స్ యజమాన్యానికి కొంత భారమే. దీంతో ఐదారేళ్ల కింద మోటారు వాహనాల చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని మార్పులను వీరు అడ్డం పెట్టుకున్నారు. గతంలో ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ జరిగితే.. ఆ రాష్ట్రం బార్డర్‌లో కొంతైనా ప్రయాణం చేయాలనే నిబంధన ఉండేది. అయితే.. సడలించిన నిబంధనలతో రిజిస్ట్రేషన్ జరిగిన రాష్ట్రంలో కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడైనా వాహనాలు నడుపుకోవచ్చనే కొన్ని మార్పులతో ట్రావెల్స్ యాజమాన్యం అతి తక్కువ ఫీజులు ఉండే కేంద్ర పాలిత ప్రాంతాలైన నాగాలాండ్, డామన్ డయ్యూలకు వెళ్తున్నారు. అక్కడ నామమాత్రంగానే ఫీజులు ఉంటాయి..

మిగతా 7వ పేజీలో

ట్రావెల్ బస్సులపై గత పది నెలల్లో 186 కేసులు నమోదు చేశారు. రవాణా శాఖ అధికారులు భారీ ఎత్తున తనిఖీలు చేసి జరిమానా వేశారు.

నెల	కేసులు
జనవరి	05
మార్చి	17
మే	57
జూన్	10
జూలై	08
ఆగస్టు	21
సెప్టెంబరు	17
అక్టోబరు10కి	51
మొత్తం	186

అమ్మ ఆవేదన

- ఆధార్ అప్‌డేట్ కాక ఇబ్బందులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విజ్ఞప్తి
- స్పందించిన కలెక్టర్



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కురువ ఉసేనమ్మ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ మారుమూల గ్రామం నుంచి తన పిల్లలతో వచ్చిన మహిళ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డా. సిరికి వినతి పత్రాన్ని అందజేసింది. ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం గ్రామ సచివాలయం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. మద్దికెర మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన కురువ లక్ష్మణుడు, కురువ ఉసేనమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. అందులో పెద్దవాడు సంతోష్ కుమార్‌కు గుండె వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు లక్షల రూపాయలు అప్పు చేసి కుమారునికి వైద్యం చేయించారు. మరలా ఆరోగ్యం బాగుండకపోవడంతో ఆదోనిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స చేయించడానికి వెళ్లితే రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని హాస్పిటల్‌లో చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు లేదు.. ఇద్దరు కొడుకులు, కూతురు ఆధార్ రేషన్ కార్డులో నమోదు కాలేదు. తల్లికి వందనం ఇంత వరకు రాలేదని ఆమె వాపోయింది. ఎలాగైనా ఆధార్ కార్డు వచ్చేలా సమస్యను పరిష్కరించి తగు న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆమె విన్నవించుకుంది.



పిల్లలతో కురువ ఉసేనమ్మ

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆపరేషన్ చేయిస్తాం

జిల్లా కలెక్టర్ డా. సిరి స్పందిస్తూ ఆధార్ కార్డు సమస్యను పరిష్కరించాలని జడ్పీ సీఈవోను, తల్లికి వందనం అందేలా చూడమని డీఈవోను, కొడుకు గుండె చికిత్సను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయాలని ఇతర అధికారులను ఆదేశించారు.

అర్జీలను నాణ్యంగా పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులను పదే పదే తిప్పించుకోవద్దని, గడువులోపు నాణ్యంగా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ డా.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీకి సంబంధించి సరైన విధంగా అర్థమయ్యేలా పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంటు తయారు చేసి అర్జీదారులకు వాట్సాప్‌లో పంపించి ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. రీ ఓపెన్, గడువు దాటిన తర్వాత పరిష్కారం ఉండకూదన్నారు. పరిష్కరించలేని సమస్యలైతే అర్జీదారునికి వివరించి చెప్పాలన్నారు. ఆడిట్ ప్రక్రియ వంద శాతం చేయాలని, సీఎంవో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనూరాధ, కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.సిరి సూచించారు. జిల్లా అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వరద ప్రభావిత జిల్లాలైన నెల్లూరు, తిరుపతి జిల్లాలకు అవసరమైన మెస్, మెటీరియల్ పంపేందుకు సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ ఎస్ఈలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాప్ పేరిట మార్ఫింగ్ ఫొటోలు 6

- ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

విచారణ జరిపి న్యాయం చేస్తాం: ఎస్పీ 7



ఉరుకుంద రోడ్డులో చాప వంకపై ప్రవహిస్తున్న నీరు

కోసిగిలో దంచి కొట్టిన వాన

- ఉధృతంగా ప్రవహించిన చాప వంక
- 4 గంటల పాటు రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు, ఉరుకుంద భక్తులు



కోసిగిలో ఉధృతంగా కురుస్తున్న వర్షం

కోసిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సోమవారం మధ్యాహ్నం నుంచే కోసిగిలో వర్షం దంచి కొట్టింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ముఖ్యంగా కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంకకు వరద నీరు పోటెత్తడంతో సుమారు 4 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒకరి ఒకరు చేతులు పట్టుకుని ప్రజలు చాపవంక దాటారు. స్థానికంగా కొందరు యువకులు టీడీపీ క్లస్టర్-4 ఇన్‌చార్జి, మండల టీడీపీ యువ నాయకుడు జ్ఞానేష్ తమ యువకులతో కలిసి చాపవంక వద్ద ప్రయాణికులను వాగును దాటించారు. అనంతరం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి సహాయ సహకారాలు అందజేశారు. ఎస్ఐ హనుమంతరెడ్డి చాపవంక వద్ద ప్రయాణికులను, విద్యార్థులను అప్రమత్తం చేస్తూ వంకను దాటించారు. యువకుల సాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణికులను వాగు దాటించారు. సుమారు గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు బారులు తీరాయి. మొదటి కార్తీక సోమవారం సందర్భంగా రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఉరుకుందకు తరలిరావడంతో సుమారు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 5 గంటల సమయంలో వరద ఉధృతి తగ్గిన తర్వాత ముందుకు సాగాయి.



కోసిగిలో చాపవంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒకరి చేయి ఒకరు పట్టుకుని వాగు దాటుతున్న ప్రజలు

మార్కెట్ యార్డు పాలకవర్గం ఖరారు

చైర్మన్‌గా బిల్లేకల్ వెంకటేష్



ఆలూరు మార్కెట్‌యార్డు

ఆలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే విరుపాక్షి, చైర్మన్‌గా బిల్లేకల్ వెంకటేష్, వైస్ చైర్మన్‌గా మల్లెపల్లి రంగడు, డైరెక్టర్లుగా ఈడిగ మాధవి, బోయ సరోజ, గొల్ల సుదర్శన్, కె. సరస్వతి, కె. పార్వతి, కోసిగి శ్రీనివాసులు, వనితభాయి, హెచ్. లక్ష్మీ, బండారు మారుతి, ఉసిని లక్ష్మీ, పి. లక్ష్మీ, పైగేరి కురువ గోపాల్, ఎం. నబిరసూల్‌లను నియమించారు. మార్కెట్‌యార్డు పాలకవర్గంలో అన్ని వర్గాలకు వారి సేవలను పరిగణలోకి తీసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు నియమించామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి సోమవారం తెలిపారు.


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


క్యూలైన్లలో భక్తులతో మాట్లాడుతున్న ఈవో


ఆకాశదీపం పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసరావు



విద్యుద్దీపకాంతుల్లో కోనేరు



శ్రీగిరిలో కార్తీక శోభ

- **తొలి సోమవారం శ్రీశైలంలో భక్తుల రద్దీ**
- **వైభవంగా లక్ష దీపోత్సవం**

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం కార్తీకశోభను సంతరించుకుంది. పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాస తొలి సోమవారం కావడంతో శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి పుష్పాలతో అలంకరించిన వేదికపై ఉంచారు. అనంతరం దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్షదీపోత్సవాన్ని నిర్వహించి శివసేవకులు భక్తులు దీపాలు వెలిగించారు. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలను చేసుకొని కృష్ణమ్మకు దీపాలను వెలిగించి పసుపు కుంకుమలతో సారె సమర్పించారు. పరమశివుని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. కార్తీకమాసాంతం శని, ఆది, సోమవారాలతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు, ఏకాదశి, పౌర్ణమి రోజుల్లో భక్తులందరికీ అలంకార దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. మాసాంతం గర్భాలయ అభిషేకాలు, సామూహికాభిషేకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు అందిస్తున్నట్లు ఆలయ



పీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. రద్దీకి అనుగుణంగా యాత్రికులకు సరిపడా లడ్డూ ప్రసాదాలను 10 కౌంటర్లలో అందిస్తున్నారు. దీపాలను వెలిగించుకునేందుకు వీలుగా ఆలయ గంగాధర మండపం, ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లో సర్వ దర్శనానికి వెళ్తున్న భక్తులతో ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.


పాతాళగంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


లక్ష దీపోత్సవానికి ఉత్సవమూర్తులు

యాగంటిలో పోటెత్తిన భక్తులు


యాగంటి గాలిగోపురం సమీపంలోని ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బనగానపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. యాగంటి క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి, యాగంటి బసవయ్యను, ఉమామహేశ్వరస్వామి, వీరభద్రస్వామి, వెంకటేశ్వర గవి, గణపతిని దర్శించుకున్నారు. ఉమామహేశ్వర స్వామికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, మహానివేదన, ఉచిత ప్రసాద వితరణ, పల్లకీ సేవోత్సవాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండు రంగారెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. యాగంటి గోపురం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ, శ్రీ ఉమామహేశ్వర రెడ్ల అన్నదాన సంస్థ, ఆర్యవైశ్య అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని నేలమఠం, చింతమానుమఠం, రవ్వలకొండ, పసుపల గ్రామ సమీపంలో వెలసిన గుండం మల్లికార్జునస్వామి ఆలయం, రామతీర్థంలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయం, బనగానపల్లె మండలంలో వెలిసిన శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు.


యాగంటి బసవయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

మల్లన్న సన్నిధిలో మంత్రి బాల వీరాంజనేయస్వామి


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి ఈవో శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు పలికించి తీర్థప్రసాదాలతో పాటు పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

బస్సు ప్రమాదంపై జగన్ తప్పుడు ప్రచారం

'కుడా' చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరదాల చాటున తిరిగి.. విచ్చలవిడిగా ప్రజల సొమ్ము దోచేసి కూటమి పాలనను తప్పుపట్టడం ఎంత వరకు సమంజసమని జగన్‌ను ప్రశ్నించారు. బస్సు ప్రమాదం జరిగిన తర్వాత ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టిందని, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. మీ పాలనలో ఒక్కరికైనా సాయం చేశారని అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత వివిధ రకాల పన్నులు విధించి ప్రజలు ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు తన అనుభవంతో పాలన అందిస్తుంటే చూసి జీర్ణించుకోలేక, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. జగన్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

జిల్లా ఖ్యాతిని చాటిచెప్పేలా కర్నూలు ఉత్సవ్

- **తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి చోటుకు కృషి**
- **టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య**

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వినూత్నమైన సంస్కృతి సంప్రదాయాలకు వేదికగా ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా నేపథ్యాన్ని భావితరాలకు అందించే దిశగా వారం రోజుల పాటూ 'కర్నూలు ఉత్సవ్ -2025' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. సోమవారం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కర్నూలు ఉత్సవ్-2025 కార్యక్రమాల బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా టీజీవీ కళాక్షేత్రంలో ఏడు రోజుల పాటూ కర్నూలు ఉత్సవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన శాస్త్రీయ, జానపద కళాకారుల ప్రదర్శనలు, సాహితీవేత్తలతో కవి సమ్మేళనాలు, కవితాగోష్ఠులు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఏడు రోజుల పాటూ నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాంకిక నాటక పోటీలు ఉంటాయన్నారు. వారంలో మొత్తం 40 నాటకాలను 120 మంది కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రతిరోజూ నిర్విరామంగా 12 గంటల పాటూ కళాప్రదర్శనలు అరుదైన విషయంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేయబోతోందని తెలిపారు. ఇదివరకు టీజీవీ కళాక్షేత్రం రెండుసార్లు ఈ రికార్డులను నమోదు చేసుకుందని గుర్తు చేశారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

వెయ్యిమందితో ర్యాలీ : నవంబరు ఒకటిన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు వెయ్యి మంది కవులు, కళాకారులు, యువతతో భారీ ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభిస్తారని పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల చాయాచిత్ర ప్రదర్శన కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్నామని, ఏడు రోజుల పాటూ ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు సత్కారం ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో కళలు, సాహిత్యం, నాటకరంగం, సంగీతం, గాత్రం, మిమిక్రీ, ఇంద్రజాలం, ఆహార్యం, సామాజిక సేవల్లో రాణిస్తున్న 250 మందిని సత్కరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కళాకారులు పి. రాజారత్నం, పీపీ గురుమూర్తి, జీవీ శ్రీనివాసరెడ్డి, చల్లా నవీన్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మార్ఫింగ్ ఫొటోలతో అసత్య ప్రచారం

- **బస్సు ప్రమాదం నేపథ్యంలో బెల్ట్‌షాపుల వల్లే అంటూ కల్పితాలు సృష్టిస్తున్నారు**
- **ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు**



కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు పేరుతో మార్ఫింగ్ ఫొటోలతో తప్పుడు ప్రచారం తగదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. నగరంలోని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద స్థలానికి, మద్యం దుకాణానికి 3 కిలోమీటర్ల దూరం ఉందని చెప్పారు. అయితే ఏమీ లేని చోట.. బెల్టుషాపు ఉందని.. అందులో కొన్నారని ఫొటోలు మార్ఫింగ్ చేసి ప్రచారం చేయడాన్ని ఖండించారు. మద్యం దుకాణంలో మద్యం కొన్న విషయం వాస్తవమేనని, సీసీ పుటేజీలను మీడియాకు కూడా విడుదల చేశామని చెప్పారు. తప్పుడు కథలు, కల్పితాలు సృష్టించి ఈ ఘటనను పక్కదారి పట్టించేందుకు కొందరు ప్రయత్నించడం సరికాదన్నారు. బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో శివశంకర్, ఎర్రిస్వామి మద్యం తాగారన్న విషయంలో కేసులు, విచారణ జరుగుతున్న సమయంలో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

అమ్ముకోక తప్పదా?

- **రైతులను వెంటాడుతున్న తుఫాన్ భయం**
- **దళారులు అడిగిన ధరకే మొక్కజొన్న విక్రయాలు**


చాగలమర్రిలో సర్వీసు రహదారిలో మొక్కజొన్నను ఆరబెట్టుకుంటున్న రైతులు

చాగలమర్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏ రూపంలో ప్రకృతి ప్రకోపించినా రైతులకు కష్టాలు తప్పవు. నష్టాలు తప్పవు. కొద్ది రోజులుగా వెంటాడుతున్న తుఫాను వల్ల మొక్కజొన్న రైతులు దారుణంగా నష్టపోయారు. మొంథా తుఫాను వల్ల చేతికి వచ్చిన పంటను నష్టానికి తెగనమ్ముకోవాల్సి వస్తోంది. 10 రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను మరిన్ని రోజులు వెంటాడుతుందని కూడా అనిపిస్తోంది. ఈ పరిస్థితిల్లో రోడ్లమీద ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలను ఎట్లా కాపాడుకోవాలో రైతులకు తెలియడం లేదు. వర్షాలకు పంట దిగుబడి తడిసిపోతే మరింత నష్టం వస్తుందని దళారులు ఎంతకు అడిగితే అంతకు రెండు రోజులుగా తెగనమ్ముకొని నష్టపోతున్నారు. మరీ కనిష్ఠ ధరకు అమ్ముకుంటే పెట్టుబడి ఖర్చు కూడా రాదని తెలుసు. అయినా తప్పడం లేదు. వ్యాపారులు, దళారులు ఎంత ధర చెబితే అంతకే మారు మాట లేకుండా విక్రయిస్తున్నారు. మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, జ్ఞానాపురం, మూడురాళ్లపల్లె, పెద్దబోదనం, చాగలమర్రి గ్రామాలతో పాటు రైతులు 10 రోజులుగా వర్షానికి అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు పట్టలు కప్పడం, తిరిగి ఆరబెట్టడం ఇదే తంతుగా మారింది. కొందరు రైతులు తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌తో గృహాలకు తరలించుకుంటున్నారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనను గమనించిన కొందరు వ్యాపారులు తక్కువ ధరకు కొనేందుకు సిద్ధమయ్యారు. సోమవారం కొద్దిగా తెరపి ఇవ్వడంతో తక్కువ ధర చెల్లించి మొక్కజొన్న సొంతం చేసుకుంటున్నారు. క్వింటంకు రూ.1,600 నుంచి రూ.1,900 దాక ధర చెల్లించి కొనుగోలు చేపట్టారు. రైతులు చేసేది లేక తక్కువ ధరకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరి కొందరు రైతులు మనసు ఒప్పక రోడ్ల మీద అలాగే ఉంచారు. చాగలమర్రి సర్వీసు రహదారిపై మొక్కజొన్నను ఆరబెట్టారు. వర్షం భయంతో కుప్పలు చేసి వాటిపై పట్టలు కప్పి ఉంచారు. ఇట్లా తక్కువ ధరకే తాము పంట దిగుబడి అమ్ముకోక తప్పదా? అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

తుఫాన్‌తో రైతులకు కన్నీటి కష్టాలు


మొంథా తుఫాన్ తో దెబ్బ తిన్న పత్తి పంట

ఆలూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అకాల వర్షాల వల్ల పత్తి, మిరప, ఉల్లి పంటల్లో మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కురుకుంద, ముద్దనగేరి, మనేకుర్తి, పెద్దహోతూరు, హత్తిబెళగల్, మూసానహళ్లి, మొలగవల్లి, కమ్మరచేడు, అరికెర తదితర గ్రామాల్లో సోమవారం మొంథా తుఫాన్ వల్ల పంటల్లో నీరు నిల్వ చేరి అపార నష్టం వాటిల్లింది. పత్తి, ఉల్లి పంటలు మొలకలు రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం పప్పుశనగ విత్తనం సాగు చేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కురుకుందలో మిరప పంటలో చేరిన వర్షపునీరు

ఓ ఉత్తరం రాస్తావా?

- **తపాలా శాఖ ఆధ్వర్యంలో ఉత్తరాల పోటీలు**
- **వయో పరిమితి లేకుండా అందరూ అర్హులే**
- **డిసెంబరు 8 వరకు దరఖాస్తుల స్వీకరణ**





కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ యుగంలో పోస్టుకార్డు కనుమరుగైంది. అయితే మారిన కాలానికి అనుగుణంగా తపాలా శాఖ అప్‌గ్రేడ్ అవుతోంది. ఈ క్రమంలో తపాలా సేవలు, ఆ కాలం నాటి పోస్టుకార్డుల గురించి విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా సరికొత్త అంశంతో పోటీలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది లెటర్ టూ మై రోల్ మోడల్ అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో ధాయ్ ఆఖర్ పేరుతో ఈ పోటీలు జరుపుతోంది. దీనిలో భాగంగా ప్రియమైన నువ్వు..ఓ ఉత్తరం పంపు అంటూ ప్రోత్సహిస్తూ పోటీలు పెట్టింది.

బహుమతులు ఇలా..!

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతి అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని జాతీయస్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానానికి రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు ప్రదానం చేస్తారు.

అర్హులు ఎవరంటే..!

ఉత్తరం రాసే వారు భారత పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు. 18 ఏళ్లలోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. చేతితో రాసిన వ్యాసాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ 500 పదాలకు మించకుండా రాయాలి. వీటిని పాతబస్టాండు సమీపంలోని సూపరింటెండెంట్ కార్యాలయం, కర్నూలు-518001 చిరునామాకు, లేదా సమీపంలోని తపాలా కార్యాలయాలకు డిసెంబరు 8వ తేదీలోగా పంపాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను పాఠశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలి. తపాలాశాఖ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి.

-జి. జనార్దన్‌రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్, కర్నూలు

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

ఉయ్యాలవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందారు. వివరాలివీ.. ఉయ్యాలవాడ మండల కేంద్రానికి చెందిన మహబూబ్ పీర(48) ఇంజేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మహబూబ్ పీర ఈనెల 24న రాత్రి తన మిత్రులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. అయితే అక్కడ ఈనెల 26న మధ్యాహ్నం గుండెపోటు రావటంతో ఆయన స్నేహితులు ఆయనను వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మహబూబ్ పీర (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హాలహర్వి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నమ్మ(65) మృతిచెందారు. వివరాలివీ.. రత్నమ్మను సోమవారం ఉదయం ఓ వాహనం ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. వాహనాన్ని హెడ్ కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్ స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నూర్పిడి యంత్రం బోల్తా పడి మహిళ..

- యువతికి గాయాలు

పత్తికొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నూర్పిడి యంత్రం కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన పత్తికొండ మండలం పందికోన గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలివీ.. గ్రామానికి చెందిన తలారి సరస్వతి, వాసవితో పాటు మరికొందరు కూలీలు నూర్పిడి యంత్రంపై పనికి వెళ్తున్నారు. ఆ యంత్రం అదుపు తప్పి బోల్తా పడడంతో యంత్రం కిందపడి తీవ్రగాయాలతో తలారి సరస్వతి ((45)తో పాటు వాసవి అనే యువతి గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం పత్తికొండ ఆసుపత్రికి తరలించగా సరస్వతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన వాసవి ప్రథమి చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలి

- రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతిలో మోసపోయాం
- పత్తికొండ ఆర్డీవోకు బాధితుల మొర



రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న బాధితులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతిలో మోసపోయామని, న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం పత్తికొండలో ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలోని ఆర్.ఎస్.పెండేకల్ గ్రామంలో 2016లో సర్వే నెంబర్ 509బీ1, 509బీ2లో 1.02 ఎకరాల స్థలంలో వెంచర్ వేసి ఎద్దులదొడ్డి రామచంద్రుడు ప్రచారం చేసుకున్నారని, దీంతో చుట్టుపక్కల గ్రామాలైన ఇందిరంపల్లి, చందోలి, పెద్దపూజల్ల తదితర గ్రామాలకు చెందిన 19 మంది ఒక్కొక్కరు రూ.90 వేలు వెచ్చించి 2 సెంట్లు ప్రకారం స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ సర్వే నంబర్ పరిధిలోని భూమి రైల్వేశాఖ పరిధిలోకి వెళ్లిపోయిందని అధికారులు చెబుతున్నారని, దీనిపై వ్యాపారిని నిలదీస్తే చేతులెత్తేశాడని చెప్పారు.

2016లో రూ.90 వేలతో రెండు సెంట్ల స్థలం కొన్నా



ఆర్.ఎస్.పెండేకల్‌లో 2016లో రూ.90 వేలు వెచ్చించి 2 సెంట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారి ద్వారా కొనుగోలు చేశా. స్థలానికి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నా. స్థలం కోసం వెళ్తే మీ స్థలం లేదంటూ రైల్వేశాఖ అధికారులు చెప్పారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి. **- కృష్ణ, బాధితుడు, పెద్దపూజర్ల**

వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



మాకు మాయ మాటలు చెప్పి స్థలాలను అమ్మి మోసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి. మాకు అమ్మిన స్థలానికి ఆన్‌లైన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరు ఉండడంతో రైల్వేశాఖ ఇచ్చిన నష్టపరిహారం వ్యాపారి అకౌంట్‌లో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యాపారి మాకు స్థలమైనా చూపించాలి. డబ్బులైనా తిరిగి ఇవ్వాలి.**- సుధాకర్, బాధితుడు, ఇందిరాంపల్లి**

శ్రీశైలంలో అన్యమత ప్రార్థనలు

భద్రతా లోపాలే కారణమంటున్న భక్తులు

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో అన్యమత ప్రార్థనలు చేసిన ఘటన సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో నంది సర్కిల్ సిద్దరామప్ప కాంప్లెక్స్ సమీపంలో టూరిస్టు బస్సులో అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి నమాజు చేస్తున్న వీడియోను భక్తులు తీసి దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయ ముఖ్య భద్రతా అధికారి శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షేత్ర పరిధిలో అన్యమత ప్రార్థనలు చేయకూడదని తెలియపరిచారు. అనంతరం ఆ వ్యక్తితో పాటు ఏపీ29 టీబీ 5200 నంబరు గల బస్సును స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పవిత్రమైన హిందూ క్షేత్రంలో అన్యమతస్థుల ప్రార్థనలు, ప్రచారాలకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ సంభవించడం ఆలయ భద్రత నిర్లక్ష్యానికి నిదర్శనమవుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది వాహనాలపై గల అన్యమత చిహ్నాలు, వాక్యాలు కనిపించకుండా ఓం నమఃశివాయ స్టిక్కర్లు వేసి క్షేత్ర ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

శ్రీశైల క్షేత్ర పరిధిలో హిందూ దేవదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం అన్యమత ప్రచారం, అన్యమత ప్రార్థనలు కూడా చేయకూడదు. అవగాహన కల్పిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత క్షేత్ర అధికారులపై ఉంది. ఎండోమెంట్ యాక్ట్ జీవోఎంఎస్ నెంబర్ 7473087-2007 ప్రకారం క్షేత్ర పరిధిలో అన్యమత వస్త్రధారణ, ప్రార్థనలు, ప్రచారాలు చేయడం పూర్తిగా నిషిద్ధం. ఈ విషయంపై యాత్రికులకు అవగాహన కల్పిస్తూ క్షేత్ర ప్రవేశం చేసే ముఖద్వారం మొదలుకుని పరివార ఆలయాలు, శిఖరేశ్వర ఆలయ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, అవుటర్‌రింగ్ రోడ్డు, సత్ర సముదాయాలు, పార్కింగ్ ప్రాంతాల్లో నిబంధనల వివరాలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలు హిందూ ధార్మిక సంస్థలు దేవస్థానం అధికారులను కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సిరి ఆదేశించారు. సోమవారం హౌసింగ్, పీజీఆర్ఎస్ అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల వివరాలు పంపాలని సూచించారు.

పోలీసుల్లో మార్పు తీసుకురండి

- లాయర్లు, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు
- పోలీసుల పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతోంది
- చలో కర్నూలుకు కదిలిన ఆదోని న్యాయవాదులు
- ఎస్పీకి ఫిర్యాదు.. కలెక్టరేట్ వద్ద ధర్నా



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఆదోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు

కర్నూలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్‌లో కొందరు పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆదోని పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌కు ఓ కేసు విషయంలో వెళ్లిన న్యాయవాదుల పట్ల అక్కడి సీఐ అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించిన తీరుకు నిరసనగా ఆదోని బార్ అసోసియేషన్ చలో కర్నూలు కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. అసోషియేషన్ అధ్యక్షుడు వి. శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎల్‌కే జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో ఎస్పీని కలిశారు. వివిధ పనులు, కేసులు విషయంలో పోలీస్ స్టేషన్లకు వెళ్లే న్యాయవాదులు, సామాన్య ప్రజల పట్ల కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని, దీనివల్ల పోలీసు శాఖ విశ్వసనీయత దెబ్బతింటుందని వివరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విధానం తీసుకురావాలని, న్యాయవాదులు, సామాన్య ప్రజల గౌరవ భావంతో చూడాలని కోరారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించారని బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అక్కడి నుంచి వారు కలెక్టరేట్ చేరుకొని ధర్నా చేశారు. ఆదోని బార్ అసోసియేషన్ చేపట్టిన చలో కర్నూలు నిరసన కార్యక్రమానికి ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ బార్ అసోసియేషన్లు మద్దతు పలుకుతూ ధర్నాలో పాల్గొన్నారు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ పి.రాజారత్నం, సీనియర్ న్యాయవాదులు జీవీ దేశాయ్, రామిరెడ్డి, విరుపాక్షిరెడ్డి, కేజీ వెంకటేశ్, చంద్రయ్య, తబ్రేజ్ పాల్గొన్నారు.

ఆదోని టూటౌన్ సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు లీగల్: ఆదోనిలో సీనియర్ న్యాయవాది వెంకటేశ్‌పై ఆదోని టూటౌన్ సీఐ దురుసుగా ప్రవర్తించి అవమానించారని ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కర్నూలు న్యాయవాదులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.హరినాథ్ చౌదరి, బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎస్పీకి వినతి పత్రాన్ని అందజేశారు. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, పోలీసు అధికారులే న్యాయవాదులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి తలవంపు తెచ్చేలా ఉందన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకుని వచ్చి వారికి భద్రతను కల్పించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో న్యాయవాదులు రవికాంత్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, రవికాంత్ ప్రసాద్, మోహన్‌బాబు, ఎం.సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

కర్నూలులో చివరి మజిలీ

- తమిళనాడు వాసికి అంత్యక్రియలు
- పూర్తయిన మృతదేహాల అప్పగింత



ప్రశాంత్ రాజన్ మృతదేహంపై పడి ఏడుస్తున్న తండ్రి



ప్రశాంత్‌రాజన్ (ఫైల్)

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ధర్మపురం జిల్లా జితన్‌హల్లికి చెందిన ప్రశాంత్ రాజన్(29) కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. అతడి మృతదేహానికి సోమవారం ఉదయం కర్నూలులోని జమ్మిచెట్టు వద్ద ఉన్న ఎలక్ట్రికల్ కిమాటోరియంలో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. కర్నూలు నుంచి సొంత ప్రాంతమైన తమిళనాడుకు తీసుకెళ్లడం కష్టమని భావించి తండ్రి ఇక్కడే అంత్యక్రియలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో స్థానికంగానే అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు కర్నూలు జీజీహెచ్‌లోని మార్చురీ నుంచి మహాప్రస్థానం వాహనంలో ప్రశాంత్ రాజన్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. జమ్మిచెట్టు వద్ద ఎలక్ట్రికల్ కిమాటోరియంలో బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చివరి చూపు లేకుండా ఏ మాత్రం సంబంధం లేని కర్నూలులో ఖననం చేయాల్సి వస్తోందని తండ్రి రాజన్ కన్నీరు మున్నీరయ్యారు. ప్రశాంత్ రాజన్ అంత్యక్రియలతో బస్సు అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన అందరి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించే ప్రక్రియ పూర్తయిందని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రాత్రి 8.45 గంటలకు 18 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించామని, బీహార్‌కు చెందిన వ్యక్తి మృతదేహాన్ని కూడా ఎలక్ట్రికల్ కిమాటోరియంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు.

16న కమ్మ కులస్థుల కార్తీక వన భోజనాలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నవంబరు 16న కమ్మ కులస్థుల కార్తీక వనభోజన మహోత్సవం ఏర్పాటు చేసినట్లు జిల్లా కమ్మసంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, పెనికలపాటి రాజశేఖర్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎ.క్యాంపు మాంటిస్సోరి హైస్కూల్ ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో కార్తీక వనభోజన మహోత్సవ ప్రచార కరపత్రాలు సంఘ ప్రతినిధులతో కలిసి వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీక మాసంలో జిల్లా కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా నవంబరు 16న నందికొట్కూరు రోడ్డులోని కమ్మ సంఘ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కమ్మ కులస్తులంతా ఈ వనభోజన మహోత్సవానికి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సాంస్కృతిక, సంప్రదాయ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మసంఘం కార్యవర్గ సభ్యులు జంపాల మధు, కూనుపాటి బాబ్జి, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపి, అమిత్, కరుణాకర్ చౌదరి, మీనాక్షినాయుడు, శేఖర్, పి.నాగేశ్వరరావు, గుమ్మల్ల విజయశేఖర్, చంద్రశేఖర్, రంగయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

నిబంధనలకు పాతర

(5వ పేజీ తరువాయి)



కర్నూలులో ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు జిల్లాలో మొత్తం 15 ట్రావెల్స్ బస్సులు ఉన్నాయి. వీటిలో ఏపీ రిజిస్ట్రేషన్‌తో 12 బస్సులు ఉన్నాయి. అందులో 11 ఆదోని రిజిస్ట్రేషన్‌తో ఉండగా.. ఒకటి కడప రిజిస్ట్రేషన్‌తో ఉంది. మూడు ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో కర్నూలు కేంద్రంగా ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. రెండు నాగాలాండ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. మరో బస్సు అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ హైదరాబాదు, బెంగుళూరు, హైదరాబాదు- తిరుపతి మధ్య తిరుగుతున్నాయి. షబానా ట్రావెల్స్, జేఎస్ ట్రావెల్స్, శ్రీనివాస ట్రావెల్స్ ఇవి కర్నూలు కేంద్రంగా ఉన్న ట్రావెల్స్

నిబంధనలకు పాతర..

ఇటీవల వేమూరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనతో అసలు ఈ ట్రావెల్ బస్సుల యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటిస్తున్నాయి? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ప్రయాణికుల ఒకటో, రెండో లగేజీ బ్యాగులు తీసుకెళ్లాల్సిన ట్రావెల్స్ బస్సులు మొత్తం వాణిజ్య సరుకులనే సరఫరా చేస్తున్నాయి. ప్రయాణికుల టికెట్‌తో వచ్చే లాభం కంటే ఈ రవాణా వల్ల వచ్చే లాభం అధికంగా ఉంటుంది. బస్సు కింద ఉండే ట్రావెల్‌లో పైన ఉన్న ప్రయాణికుల కంటే ఎక్కువ లోడ్ వేస్తున్నారు. వీటిలో అగ్ని మాపక శాఖ పరికరాలు కానీ, ఎమర్జెన్సీ డోర్లు కానీ ఉండటం లేదు. దీనికి తోడు అత్యవసర సమయాల్లో అద్దాలు పగలకొట్టేందుకు ఉండాల్సిన చిన్నపాటి సుత్తెలు కూడా అందుబాటులో ఉండటం లేదని గుర్తించారు. ఈ ట్రావెల్ బస్సులన్నీ టూరిస్టు బస్సులుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. కాంట్రాక్టు క్యారేజ్ మాత్రమే తీసుకెళ్లాలి. అంటే ఓ సమూహ ప్రయాణికులను ఓ ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లేందుకు అనుమతులు ఉంటుంది. అయితే వ్యక్తిగత టికెట్లు మాత్రమే వసూలు చేస్తున్నారు.

తనిఖీలో వెల్లడైన నిజాలు..

- కొన్ని బస్సులకు సరైన రికార్డులు లేవు.
- ఎమర్జెన్సీ బటన్ అలారం, డోర్ కూడా ఉండటం లేదు
- వర్షాకాలంలో అద్దాలు తుడిచేందుకు ఉపయోగించే విండ్‌షీల్డ్ కూడా లేవు.
- అత్యవసర అద్దాలు పగులకొట్టే సుత్తెలు, మంటలు ఆర్పే పరికరాలు లేవు.
- ప్రయాణికుల లిస్టు కూడా సరిగ్గా మెయిన్‌టెనెన్స్ చేయడం లేదు
- డ్రైవర్లు అత్యాశతో మధ్య మధ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు
- అతివేగంతో వెళ్తున్నట్లు గుర్తించారు.
- సరైన అనుభవం, శిక్షణ ఉన్న డ్రైవర్లను కూడా నియమించుకోవడం లేదు.

మారనీ తీరు..

కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 19 మంది మృతి చెందిన ట్రావెల్స్ యాజమాన్యంలో కాసింత మార్పు కూడా కనిపించడం లేదు. తమను ఎవరు ఏం చేస్తారనే ధీమాతో నిబంధనలకు పాతర వేసి వాహనాలు నడుపుతున్నారు. గత మూడు రోజులుగా రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తుండగా.. కేసులు నమోదు చేస్తున్నా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మూడు రోజులుగా రవాణా శాఖ అధికారులు కర్నూలు జిల్లాలోనే 63 కేసులు నమోదు చేశారు.

దాడులు ముమ్మరం చేస్తాం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉంటాం. ఎలాంటి అనుమతులు లేకుండా అగ్ని మాపక సహాయ పరికరాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే. పలుసార్లు తప్పులు చేస్తే వాహనాలు సీజ్ చేసేందుకు వెనుకాడబోం. అనధికారిక ఆల్ట్రేషన్‌తో తిరుగుతున్న రెండు బస్సులను సీజ్ చేశాం. దాడులను మరింత ఉధృతం చేస్తాం. **- శాంత కుమారి, డీటీసీ, కర్నూలు**

విచారణ జరిపి న్యాయం చేస్తాం: ఎస్పీ

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 135 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులివీ..

కర్నూలులో వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తామని గోనెగండ్లకు చెందిన విశ్వనాథ్ రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు స్టాంటన్‌పురం చెందిన రాచపూడి మనోజ్ ఫిర్యాదు చేశారు. నంద్యాలలో అగ్రికల్చర్ డిపార్టుమెంటులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఆకుల సురేంద్ర రూ.3.10లక్షలు తీసుకుని మోసం చేవాడని నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన ఈడిగ భారతి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకున్నా ఇచ్చినట్లు రూ.30 లక్షలకు ఇంటిని మార్టగేజ్ చేసినట్లు డాక్యుమెంట్లు తయారు చేసి మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శరీన్‌నగర్‌కు చెందిన మరియమ్మ ఫిర్యాదు చేశారు. పొలంలోకి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన ఆనంద్ ఫిర్యాదు చేశారు. కేవీ సుబ్బారెడ్డి కళాశాల, అశోక ఇంజనీరింగ్ కళాశాలకు ఎదురుగా రైల్వే ట్రాక్ అవతల కొందరు ఆకతాయిలు తమ పొలంలో చెట్ల కింద మద్యం సేవించి తర్వాత మద్యం సేవించిన ఖాళీ సీసాలను పొలంలో అక్కడే పడేస్తున్నారని, పొలం పనులకు వచ్చిన కూలీలను బెదిరిస్తున్నారని కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన ఎర్రమల ఫిర్యాదు చేశారు. తన చిన్న కుమారుడు, కోడలు ఆస్తి గురించి గొడవలు పడుతూ వృద్ధాప్యంలో తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు సంజీవనగర్‌కు చెందిన రాములమ్మ ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా కృష్ణమూర్తి బాధ్యతలు



జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్దిని కలిసిన కృష్ణమూర్తి

కర్నూలు లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంటు ప్లీడర్‌గా బి.కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఇన్‌చార్జి జీపీగా బాధ్యతలు నిర్వర్తించిన ఏజీపీ సయ్యద్ శాబుద్దీన్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కృష్ణమూర్తి ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. జిల్లాలోని జిల్లా కోర్టులలో ఆయన ప్రభుత్వం తరుపున తన వాదనలను వినిపిస్తారు. ఆ తర్వాత ఆయన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్దిని కలిసి పూలబొకే అందించారు. ఆయన పదవి స్వీకరించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం

- ఏపీఈసీఏ జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ సవరణ బిల్లు 2025కు వ్యతిరేకంగా తీర్మానించినట్లు ఏపీ ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా విద్యుత్ వినియోగదారుల సంఘం దక్షిణ జోన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ నుంచి 32 మంది సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లో వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ బిల్లుతో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల అమర్చే ఖర్చును ప్రజలపైనే వేస్తారని తెలిపారు. సంస్థపై ప్రభుత్వ నియంత్రణ తగ్గిపోతుందని, విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ప్రజా ప్రయోజనం కంటే లాభం ముఖ్యమవు గ్రామీణ, పేద వినియోగదారులకు సబ్సిడీలు తగ్గిపోవడం వల్ల విద్యుత్ ధరలు అందరికీ ఒకేలా పెరుగుతాయన్నారు. సేవలో నాణ్యత తగ్గే అవకాశం ఉందన్నారు.

సీఎస్ ఆర్ఎంవోగా డా. పద్మజ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డా.పి. పద్మజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న ఆమెను పదోన్నతిపై సివిల్ సర్జన్‌గా బదిలీ చేశారు. ఆమె మాట్లాడుతూ తన తండ్రి కర్నూలులో పని చేశారని తాను ఇంటర్, ఎంబీబీఎస్ కర్నూలులోనే చదివానన్నారు. డా.పి.పద్మజ భర్త ఒంగోలులో అప్తామాలజిస్టుగా పని చేస్తున్నారు.

టిడ్కో లబ్ధిదారులు డీడీ చెల్లించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జగన్నాథ గట్టు ఎన్టీఆర్ కాలనీ టిడ్కో లబ్ధిదారులు పూర్తి మొత్తం డీడీని వారంలోపు చెల్లించి, గృహాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. సోమవారం నగర పాలక సమావేశ భవనంలో అడ్మిన్‌లతో సమావేశం నిర్వహించారు. అడ్మిన్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి డిడి చెల్లించేలా చొరవ చూపాలన్నారు. ఏసీ ఆర్‌జీవి. కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌వో జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, మధు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిరి, జేసీ నూరుల్ కమర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ మేళాను వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జేసీ నూరుల్ కమర్‌తో కలిసి ఆవిష్కరించారు. అక్టోబరు 30న ఎన్‌సీసీ క్యాంటీన్ సమీపంలోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో 14 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారని 18 నుంచి 35 సంవత్సరాల్లోపు పది నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్ చదివినవారు అర్హులన్నారు. 9676141731, 7993477317, 8886319997 నంబర్లలో సంప్రదించాలని ఉపాధి అధికారి దీప్తి సూచించారు.

మైనార్టీ యువతకు ఉద్యోగావకాశాలు

నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు మైనార్టీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఏడీ పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రిషన్ లేదా డిప్లమా పూర్తిచేసి, 30 సంవత్సరాల్లోపు వారు నవంబరు 2వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలన్నారు. వివరాలకు 9988853335 నంబర్లో సంప్రదించాలన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు వర్సిటీ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ఆర్‌యూ వీసీ వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం చాంబర్లో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి లక్ష్మిలోకేష్, సెయింట్ జోసెఫ్స్ విద్యార్థిని పి.మానసను అభినందించారు. ఈనెల 31 నుంచి నవంబరు 9 వరకు హేమ చంద్రచార్య నార్త్ గుజరాత్‌యూనివర్సిటీలో నిర్వహించే పరేడ్ క్యాంప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, పీడీ పి. శివకిషోర్ పాల్గొన్నారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం



సప్తగిరినగర్ అయ్యప్పస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించారు. సప్తగిరినగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం ప్రాంగణంలోగల శివాలయంలో, కేసీ కెనాల్ వినాయక ఘాట్ సమీపంలోని రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం, కొత్తపేట నాగసాయి ఆలయం, పాతనగరంలోని శివాలయం, నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరం, జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో మహిళలు సామూహిక దీపోత్సవాలు నిర్వహించారు.



జగన్నాథగట్టుపై న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



లలితాపీఠంలో పుష్పాలంకరణ

అర్జీలను పరిష్కరించాలి

● కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ డా.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం జేసీ నూరల్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆర్జీఈ విద్యార్థులకు మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని, ఫీజు పరిమితిని రూ.30వేలకు పెంచాలని, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు వినతి పత్రం అందజేశారు.

● ఎస్సీల భూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పునరావృతం కాకూడదు

● నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి వినతులు నిర్వహించారు. 30 అర్జీలు వచ్చాయని, వచ్చిన సమస్యలే మళ్లీ రావడంపై పట్ల అసహనం వ్యక్తం చేశారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డీసీ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ప్రజారోగ్య అధికారి నాగరాజు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఆర్‌వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, టిడ్కో అధికారి పెంచలయ్య ఉన్నారు.

● 32,33 వ వార్డులలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకులు కే.సుధాకరప్ప, బీకే.రామక్రిష్ణ, జె.శ్రీనివాసులు కోరారు. వార్డులో హంద్రీ నది వెంట ముజఫర్ నగర్, ఐఎంఎల్ డిపో నుంచి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు డ్రైనేజీ, గంగావతి నగర్‌లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు ప్రేక్షకుల అభిమానం మరువలేనిది

● సినీ దర్శక నిర్మాత శాంతికుమార్



మాట్లాడుతున్న దర్శకుడు, నటులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమ పట్ల కర్నూలు ప్రేక్షకులు చూపే అభిమానం మరువలేనిదని దర్శక నిర్మాత శాంతికుమార్ అన్నారు. బ్రహ్మఆర్ట్స్ పతాకంపై, '3.2.1' చిత్రం నిర్మిస్తున్న ఆయన సోమవారం యూనిట్‌తో కర్నూలుకు వచ్చారు. రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతూ జిల్లాలో అందమైన లొకేషన్లు ఉన్నాయన్నారు. సన్నివేశాల చిత్రీకరణకు అనుమతించిన కళాశాల ఛైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బీకే కరణ్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి విడిపోయాక రాష్ట్రంలో ప్రత్యేక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేశామన్నారు. సంస్థ ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సహకారంతో ఏపీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కథానాయిక లావణ్య, సహ నిర్మాత రామానుజరెడ్డి, పీఆర్వో నాగేశ్వరబాబు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యేగౌరుచరితారెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధికి కింద మంజూరైన రూ.11 లక్షల చెక్కులను అందజేశారు. పెరుగు పురుషోత్తంరెడ్డి, రామాంజనేయులు, నాగముని, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, దేవేంధర్‌రెడ్డి, శేఖర్‌చౌదరి పూల ఆంజనేయులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపాలి

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కరించాలని డీటీ ధనుంజయ రెడ్డి ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరించారు.నిర్వహించారు. విద్యార్థుల నుంచి రెండు, రీ సర్వే అర్జీలు వచ్చాయని పరిష్కరిస్తామన్నారు.

'పోరాటాలకు సిద్ధం కావాలి'

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంఘటిత కార్మిక ఉద్యమ నిర్మాణానికి సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. సోమవారం కేకే భవన్‌లో మాట్లాడుతూ అనంతరం కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, బి.రామాంజనేయులు, పి.నిర్మల, కేపి.నారాయణస్వామి, జే.దివాకర్, నాగేశ్వరరావు,కోశాధికారి ఎం.గోపాల్. కార్యదర్శులు ఎం.విజయ్, ఎస్.ఉమాదేవి, కే.ప్రభాకర్, ఆర్.నరసింహులు, పి.తిప్పన్న, కోటేశ్వరరావును ఎన్నుకున్నారు.

అనాథ బాలలకు ఆధార్..

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు సోమవారం అనాథ బాలలకు స్పెషల్ ఆధార్ నమోదు చేశారు. బంగారుపేటలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ సభ్యుడు రాయపాటి శ్రీనివాస్ 45 మంది బాలలకు నమోదు చేయించారు.

శనగలో యాజమాన్య పద్ధతులు పాటించండి



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని 'సంటూర ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డా.శివనారాయణ సూచించారు. సోమవారం హుశేనాపురం గ్రామంలో రైతు నజీర్ సాగుచేసిన శనగ పంటను పరిశీలించారు. బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామంలో వరిలో కలుపు మొక్కలు గురించి వివరించి రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక శాస్త్రవేత్త డా.పి.సుజాతమ్మ, నంద్యాల శాస్త్రవేత్తలు, రైతులు చంద్రపెద్దస్వామి, నజీర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నది వద్ద రెవెన్యూ అధికారులు

సి.బెళగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తుంగభద్ర నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాల్ల దండోరా వేయించారు. ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు తుంగభద్ర నదిని పరిశీలించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ఆర్డీవో కార్యాలయం ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపర్ల గ్రామం చిప్పరౌస్ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. సీ సోమవారం ఆర్డీవో కార్యలయం వద్ద కాలనీ వాసులతో కలిపి ధర్నా నిర్వహించారు. ఏళ్ల నుంచి నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్థలపట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే 2009 వరదల సమయంలో ఈ.తాండ్రపాడు పేదలకు ఇచ్చిన పట్టాలకు స్థలాలు చూపలేదని వాపోయారు. 2014లో అప్పటి ప్రభుత్వం బి.తాండ్రపాడులో టిడ్కో గృహాల పక్కనే 1,300 మందికి పట్టాలు ఇచ్చి స్థలం చూపలేదన్నారు. ఆర్డీవో సందీప్‌కుమార్, తహసీల్దార్ వెంకటరమేష్ బాబుకి వినతిపత్రం అందజేశారు. కృష్ణ, శ్రీరాములు, దాదాపీరా, ఎర్రిదాసు, చిన్నవళి, బీసన్న పాల్గొన్నారు.

లాయర్లతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ ప్యానెల్ లాయర్లతో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయా ధికారి జి.కబర్ది ఆదేశాల మేరకు న్యాయ సేవాసదన్ భవన్‌లో విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. మొదటి అదనపు న్యాయాధికారి పి.కమలా దేవి, మురళి మనోహర్ పాల్గొన్నారు.

ప్రమాద మృతులకు నివాళులు



ప్రమాద స్థలంలో నివాళి అర్పిస్తున్న సభ్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాద మృతులకు చిన్నటేకూరు వద్ద మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం రాత్రి కొవ్వొతులతో నివాళి అర్పించారు. ఒకేసారి 19 మంది మృతి చెందడంపై సంస్థ కన్వీనర్ మనోహర్ సంతాపం తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ పిలుపు మేరకు ఫ్రీజర్ బాక్సులు, దుప్పట్లు అందజేశామన్నారు. ప్రతినిధులు యానీ ప్రతాప్, స్పందన సురేష్, ప్రతాప్, అపర్ణ, మంజుల, లక్ష్మీ సాంబ, బర్మా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సి.బెళగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. జిబిల్ సంస్థ సహకారంతో హెచ్ఎం నాగలక్ష్మి అధ్యక్షతన కంటి వైద్యులు చంద్రశేఖర్, తరుణ్, శ్రావణి పరీక్షలు నిర్వహించారు. 36 మంది విద్యార్థులకు శస్త్రచికిత్స అవసరమన్నారు. 285 మంది విద్యార్థులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. పదో తగతరతిలో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.10వేలు అందజేశారు. ఎంఈవో ఆదాంబాషా, ఎస్ఐ పరమేష్‌నాయక్, జిబియల్ సంస్థ అధ్యక్షుడు శ్రీరాములు, విద్యాకమిటి ఛైర్మన్లు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, మాజీ సర్పంచ్ హనుమంతు ఉన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

కర్నూలు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కొత్తబస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఐద్వా నాయకురాలు అలివేలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, శ్యామల డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు-1 డీఎం సంధ్యారాణికి వినతిపత్రం ఇచ్చారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని మహిళ్కలకు ఉచిత ప్రయాణంతో బస్టాండ్ రద్దీగా ఉందన్నారు. కుమారి, పద్మ, సావిత్రి, పర్వీన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న గుడ్‌షెఫర్డ్ పాఠశాల లో అండర్-19 జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఏసుదాసు మాట్లాడుతూ చీరాలలో నవంబరు 7 నుంచి నిర్వహించనున్నపోటీల్లో రాణించాలన్నారు. హెచ్ఎం నరహరి, కోఆర్డినేటర్ సోనియా, ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, పీఈటీలు సురేష్ కుమార్, మధుసూదన్, మహేష్ ఉన్నారు.

శివారుపై వివక్ష ఎందుకు?

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు క్రమంగా చెల్లిస్తున్నా శివారు కాలనీలపై వివక్ష ఎందుకు చూపుతున్నారని ఆ కాలనీల వాసులు ప్రశ్నించారు. సోమవారం శ్రీలక్ష్మీ విలాస్, పార్థసారథి నగర్, గీతాంజలి నగర్, రేణుక నగర్, రాధానగర్, సత్యకీర్తి నగర్, రిచ్‌మండ్‌కాలనీ, మల్లారెడ్డి వెంచర్స్‌కు చెందిన సుమారు వంద మంది నగర పాలక కౌన్సిల్ హాల్ వద్ద పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వేసిన రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేయకుండా శివారు కాలనీలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీల ప్రతినిధులు రామన్న, అనంత లక్ష్మన్న, దివాకర్, మాలన్న, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కృష్ణ మోహన్ శర్మ, ఎంఈవో సునీలమ్మ సూచించారు. సోమవారం స్థానిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ ప్రభుత్వాన్ని ప్రకటనలో కోరారు. పదవీ విరమణకు 5 సంవత్సరాలలోపు ఉన్న వారు మినహా అందరూ టెట్ ఉత్తీర్ణులు కావాలని కోర్టు తీర్పు ఇచ్చిందని, ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయ సంఘాలు కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయన్నారుజ

కంటి వైద్య శిబిరం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సొసైటీ, కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, డా.భరత్ హాస్పిటల్ సంయుక్తంగా సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దిన్నెదేవరపాడు గ్రామంలో 120 మందిని పరీక్షించి, 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డి, సర్పంచ్ మాధవస్వామి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

'పుల్లయ్య' డీన్‌కు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల డీన్ డా.పి.రంజిత్ కుమార్‌కు జ్యోష్ఠ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని బ్రెయినోవిజిన్ తరఫున ఇచ్చినట్లు సంస్థ ముఖ్య కార్యదర్శి బి.గణేష్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ అడ్మిన్ ఎం.గిరిధర్ కుమార్ అభినందించారు.



నవంబరులో రగ్బీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నవంబరు 24, 25 తేదీల్లో కర్నూలులో అస్మిత రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. రిడ్జ్ పాఠశాల మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. మహిళలను పట్ల చైతన్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అస్మిత అనే పేరుతో బడ్జెట్ చేసిందన్నారు

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం మండలంలోని కుందనగుర్తి, చిప్పగిరి గ్రామాల్లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. అందుకే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం గ్రామ అనుబంధ విభాగాల కమిటీని నియమించారు.

మద్దికెర: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 28న పత్తికొండలో తలపెట్టిన భారీ వైసీపీ ర్యాలీని వాయిదా వేసినట్లు మండల వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల వాయిదా వేశామన్ని నవంబరు 4వ తేదీన ర్యాలీ ఉంటుందని నాయకులు గమనించాలన్నారు.

పరిష్కారం చూపాలి

దేవనకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేట్ భూములకు కూడా చుక్కల భూమిలా చూపుతోందని, పరిష్కారం చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ కోరారు. ప్రైవేట్ భూములు కుడా చుక్కల భూమిలా చుపుతుండటంతో క్రయవిక్రయ లావాదేవీలు, వివిధ రుణాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడటం జరుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సుదర్శనంకు వినతిపత్రం ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



చెక్కులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి గొప్ప వరం లాంటిదని ఆదోని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు అన్నారు. సోమవారం ఆయన నివాసంలో 16 మంది లబ్ధిదారులకు రూ.7.77 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడుతూ ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప వరమన్నారు. హాస్పిటల్ ఖర్చులకు సంబంధించిన దరఖాస్తులను సీఎంకు పంపిన వెంటనే రిలీఫ్ ఫండ్ రూపంలో అందించడం అనేది ప్రభుత్వ చిత్తశుద్ధిని సూచిస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారుల తరఫున ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, బసాపురం రామస్వామి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రామకృష్ణ, మండల అధ్యక్షుడు శివప్ప, ఈరన్న, విరుపాక్షి, అల్తాఫ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

ఆస్పరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీలో బీసీలకు పెద్దపీట వేశారని, టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం కల్పించారని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని బినిగేర గ్రామంలో వెలిసిన గిరి పంచలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్లమెంటు నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన సామూహిక భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ పార్టీలో అంతర్గత విబేధాలు లేకుండా కలిసికట్టుగా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, సీఐ ఎ.గంగాధర్, మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేష్, జీవన్‌కుమార్, వెంకటేష్, నారాయణ, రంగస్వామి, కృష్ణమూర్తి, ఉచ్చీరప్ప, రాజ్‌కుమార్, సాలిసాహెబ్, శేషిరెడ్డి, మల్లికార్జున, మునిస్వామి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం

ఆలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధగాంచిన దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కురువ వీర నాగప్ప ప్రమాణ స్వీకారం ఈనెల 31న జరుగుతుంది. ఇందుకోసం జిల్లా కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యను ఆహ్వానించినట్లు సోమవారం చైర్మన్ తెలిపారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి సహకారంతో పెద్ద ఎత్తున దేవరగట్టులో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని టీడీపీ నాయకులు, పరిసర గ్రామాల భక్తులు, పెద్దలు హాజరుకావాలని ఆయన కోరారు.

'ఉర్దూ పాఠశాలల్లో టీచర్ల కొరత'

ఆదోని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు గడ్డం ఫక్రుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ హైస్కూళ్లలో ఉర్దూ మీడియంలో కేవలం ఇద్దరు గణితం, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, దీంతో చదువులు నిలిచిపోతున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెంటనే రెండు ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయాలని ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

ఆస్పరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మందుల వీరేష్(27) అనే వ్యక్తి సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదోని పట్టణానికి చెందిన వీరేష్ పత్తికొండ ఆర్టీసీ డిపోలో విధులు ముగించుకుని ఈనెల 20న తిరిగి తన సొంత ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మండలంలోని చిగిలి బస్టాండు సమీపంలో ఫిట్స్ రావడంతో బండిపై నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ వరప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య శ్రావణి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూతపడిన స్పిన్నింగ్ మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ స్పిన్నింగ్ మిల్లు వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. వేలాది మంది కార్మికులకు జీవనాధారమైన మూడు ప్రధాన స్పిన్నింగ్ మిల్లులు మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలకు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మనీ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు గోపాల్, ఐఎన్‌టీయూసీ దేవిశెట్టి ప్రకాష్, పీడీఎస్‌యూ నాయకులు రసూల్, మల్లికార్జున పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

తుగ్గలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయులు తిప్పయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి నోపీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శివకేశవ అనే విద్యార్థి పత్తికొండలో డివిజన్ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినిని అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ ఇమామ్‌బాషా ఉన్నారు.

సామాజిక సేవా కార్యకర్తకు సత్కారం



శ్రీనాథ్ గుప్తాను సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఆదోని టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యకర్త, ఆవోపా అధ్యక్షుడు వికాస తరంగిణి ఆదోని శాఖ చీఫ్ కో ఆర్డినేటర్ వంకదారు శ్రీనాథ్ గుప్తాకు అరుదైన సత్కారం లభించింది. ఆవోపా సంస్థ ద్వారా కర్నూలు జిల్లాలో ఒక వెయ్యి కంటి ఆపరేషన్లను చేయించడం, చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న వికాస తరంగిణి ద్వారా మూడు వేల మంది చిన్నారులకు స్వర్ణామృత ప్రాసన అనే ఔషధాన్ని అందజేయడంలో కృషి చేసిన ఆదోని పట్టణానికి చెందిన శ్రీనాథ్ గుప్తాను సోమవారం అనంతపురం కు చెందిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ్ తన క్యాంపు కార్యాలయంలో ఆయనను పిలిపించి ఘనంగా సత్కరించి మొమెంటో ను బహూకరించారు.శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ ఆవోపా తో పాటు లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించగలిగానని అన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో సీనియర్ న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించి అవమాన పరిచిన టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి జ్యోష్ణదేవికి వినతి పత్రం అందించారు. న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, నరసింహాచారి, క్రిష్ణ, సత్యనారాయణ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల మృతి

ఆలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం హులేబీడు గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి మొలగవల్లి రాముడికి చెందిన 9 గొర్రెలు, మేకలు మృతిచెందాయి. మొలగవల్లి నుంచి హులేబీడు గ్రామంలో స్థిరపడి గొర్రెలు, మేకలు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. 9 గొర్రెలు మృతిచెందడంతో రూ.లక్ష మేర నష్టం జరిగిందని రాముడు వాపోయారు.

తుఫాన్‌తో రైతుల కన్నీటి కష్టాలు

ఆలూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అకాల వర్షాల వల్ల పత్తి, మిరప, ఉల్లి పంటల్లో మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కురుకుంద, ముద్దనగేరి, మనేకుర్తి, పెద్దహోతూరు, హత్తిబెళగల్, మూసానహళ్లి, మొలగవల్లి, కమ్మరచేడు, అరికెర తదితర గ్రామాల్లో సోమవారం మొంథా తుఫాన్ వల్ల పంటల్లో నీరు నిల్వ చేరి అపార నష్టం వాటిల్లింది. పత్తి, ఉల్లి పంటలు మొలకలు రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం పప్పుశనగ విత్తనం సాగుచేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో పప్పుశనగ పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

ఆదోని టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్(నాన్ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) గడువును మరో మూడు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. నాన్ లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవడం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈనెల 23తో ముగిసింది. ప్రజల విన్నపాల మేరకు ప్రభుత్వం గడువును వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు మూడు నెలల పాటు గడువును పెంచుతూ ఉత్తర్వులను జారీ చేసింది. గడువులోగా ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం ముందుకు రాని వారిపై కఠిన చర్యలు ఉంటాయని మునిసిపల్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాల వల్ల రైతులు సాగు చేసిన పంటలు నష్టపోవడం జరిగిందని సీపీఐ, సీపీఎం నాయకులు మద్దిలేటిశెట్టి, వీరశేఖర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయతం, వ్యవసాయ కార్యాలయాల వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రాల ఇచ్చారు. వేలాది రూపాయాలు పెట్టి పంటలు సాగు చేస్తే అధిక వర్షాల వల్ల దిగుబడులు రాక పెట్టుబడులు కుడా వెళ్లక రైతులు నష్టపోవడం జరిగిందన్నారు. అతివృష్టి వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పంటనష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం రైతులను ఆదుకొవాలని డిమాండ్ చేశారు. కండప్ప, బజారి, రంగస్వామి, ఉన్నారు.

వాల్మీకుల సంక్షేమానికి పెద్దపీట

● టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



వాల్మీకి నాయకులతో మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయల సంక్షేమానికి కృషి చేస్తామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నేత రామదుర్గం తిమ్మయ్య ఆధ్వర్యంలో చిప్పగిరి మండల వాల్మీకి సామాజికవర్గం నాయకులో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాలకులు వాల్మీకుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. టీడీపీ ప్రభుత్వం వాల్మీకులకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. అలాగే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు వైకుంఠం శివప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, ఏబీసీ కెనాల్ డీసీ అధ్యక్షులు నగరడోన కిష్టప్ప, సర్పంచులు నీలకంఠ, రామాంజనేయులు, పురుషోత్తం, టీడీపీ నాయకులు అంపయ్య, సురేష్, రామాంజినేయులు, కిష్టప్ప, వెంకటేష్, ఓబయ్య, ఏరూరు మహేష్, పెద్దయ్య, కటారికొండ శ్రీనివాసులు, సోమశేఖర్‌నాయుడు, కురువ హనుమప్ప, కృష్ణయాదవ్, వెంకటేష్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

క్రిష్ణగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అమకతాడు టోల్ ప్లాజా దగ్గర 25లక్షల నగదును చోరి చేసిన కేసులో నిందుతులు మహమ్మద్ షహీద్, సుహేబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. కల్లూరు మండలం దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలోని వెంగన్నబావి దగ్గర ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు పెయింటింగ్ చేసుకొని జీవితం సాగించేవారు. చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనానికి పాల్పడినట్లు ఇద్దరు అంగికరించారని, వారి వద్ద నుంచి 25లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

మద్దికెర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుపాన్ ప్రభావం వల్ల గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. వర్షం పడేసమయంలో చెట్లు, టవర్స్, పోల్స్, పొలాల్లో, బహిరంగప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాత ఇళ్లలో నివాసం ఉండే వారు చాలా జాగ్రత్త ఉండాలన్నారు. మొంథా తుపాన్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా, అవసరమైతే బయటకు రావాలని, లేకపోతే రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామదాసు, వీఆర్వో రంగస్వామి, రషీద్, స్వర్ణలత ఉన్నారు.

తుగ్గలి: మొంథా తుపాన్‌తో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ రవి, మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ అన్నారు. సోమవారం వారు రైతులతో మాట్లాడుతూ అల్పపీడనం వల్ల వచ్చే మోంథో తుపాన్‌తో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంంతలో ఉండే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రైతులు పంట నూర్పిడి చేయవద్దని లోతట్టు ప్రాంతంలో ఉన్న పొలాల రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పడాలన్నారు. ఈ రెండు రోజులు ఎవరూ కూడా అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదన్నారు.

మనేకుర్తిలో కూలిన పశువైద్యశాల



మనేకుర్తి గ్రామంలో కూలిన పశువైద్యశాల పైకప్పు

ఆలూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఓ పశు వైద్యశాల పైకప్ప కూలిపోయింది. ఆరు గ్రామాల పశువులకు ఈ వైద్యశాలే దిక్కు. మండలంలోని మనేకుర్తి గ్రామంలో ఉన్న పశువైద్యశాల పైకప్పు ఆదివారం రాత్రి కూలిపోయింది. దీంతో వైద్యశాలలో ఉన్న మందులు, సామగ్రికి నష్టం వాటిల్లింది. ఎవరూ లేని సమయంలో వైద్యశాల పైకప కూలిపోవడంతో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం పశువైద్యశాలకు వెళ్లిన డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ కొల్లమ్మ, టీడీపీ సీనికయర్ నాయకులు డీలర్ వెంకటేశ్వర్లు, కంటెప్ప గారి దేవేంద్ర పరిశీలించారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె



మట్టి మిద్దెను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

క్రిష్ణగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అమకతాడు గ్రామానికి చెందిన వడ్ల లలితకు చెందిన మట్టి మిద్దే సోమవారం కూలిపోయింది. రోజులాగే ఇంట్లో పనులు చేస్తూ ఉండగా మిద్దే పైకప్పునుంచి మట్టి రాలిపడడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు భయటకు పరుగులు తీసారు.అంతలోనే ఇంటి పైకప్పు కూలిపోయింది.ఇంట్లో ఉన్న బట్టలు,దాన్యం,వంటసామాగ్రి తదితర వస్తువులు ధ్వంసం అయ్యాయి. అయితే కుటుంబసభ్యులెవరికి ప్రమాదం జరగలేదు. పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు కూలిన మట్టిమిద్దేను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం నాయకులు సుధాకర్ బాధితులను పరామర్శించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పత్తికొండ/ పత్తికొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎస్ ఆఫ్రిద్ వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 విభాగంలో నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపిక అయ్యాడు. కర్నూల్ విద్యావికాస్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న ఆఫ్రిద్ గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించి నేషనల్‌కు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆఫ్రిద్ పాల్గొంటాడని కోచ్ బాషా తెలిపారు.

'కార్యకర్తలకు అండగా టీడీపీ'



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతి టీడీపీ కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని దైవందిన్నె టీడీపీ గ్రామ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలోని దైవందిన్నె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త మాల నరసింహులు కుటుంబానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, భాస్కర్ చంద్రశేఖర్ ఆదేశాలతో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-కన్వీనర్ రామచంద్రుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అంజినయ్య, నాగేష్, శివాజి, రామాంజనేయులు, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసాలే'



గురుజాలలో కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న బుట్టా రేణుక

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసాలేనని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుకా అన్నారు. సోమవారం మండలంలోని గురుజాలలో మండల పార్టీ అధ్యక్షుడు శివారెడ్డిగౌడు ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. బుట్టా రేణుకా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రవేటు వ్యక్తులకు అప్పగించే దిశగా చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, మురహరిరెడ్డి, రామకోటీరెడ్డి, విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చాంద్, నజీర్, రమేశ్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

3 నుంచి సమ్మె

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ ఒప్పందాల హామీలు అమలు చేయకపోతే వచ్చే నెల 3 నుంచి ఏఐటీయూసీ, మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపడతామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లప్ప, నాయకులు శివకృష్ణ, భీమన్నగౌడ్, చిన్న ఈరన్న హెచ్చరించారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గాంధీ విగ్రహానికి డిమాండ్లతో కూడిన సమ్మె పత్రాన్ని అందజేసినరసని తెలిపారు. కార్యక్రమంలో విజయేంద్ర, మహేష్, రాముడు, మల్లి, ఈరన్న, చిన్న రంగన్న పాల్గొన్నారు.

నయా దందా..!

- ఆటో డ్రైవర్‌కు మామూళ్లు ఎరవేసి దుకాణానికి సరుకు మళ్లింపు..
- లబోదిబోమంటున్న కమీషన్ ఏజెంట్లు





ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ ప్రధాన గేటు

ఎమ్మిగనూరు,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమీషన్ ఏజెంట్లుగా చలామణి అవుతున్న ఒకరిద్దరు మార్కెట్ గేటు దగ్గర మాటేసి.. మార్కెట్‌కు సరుకును తీసుకొస్తున్న ఆటో డ్రైవర్‌కు మామూళ్లు ఎరవేసి సరుకును తమ దుకాణాలకు తరలించటం పరిపాటిగా మారింది. సోమవారం ఓ ఆటోలో వచ్చిన సరుకు కోసం కమీషన్ ఏజెంట్‌గా చలామణి అవుతున్న వ్యక్తి, మరో మధ్య దళారి ఘర్షణ దిగడం విమర్శలకు తావిస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలో లైసెన్సు కలిగిన కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. వీరితో పాటు ఒకరిద్దరు లైసెన్సు లేకున్నా గత కొంతకాలంగా మార్కెట్‌లో దుకాణాన్ని అద్దెకు తీసుకొని తమకు అనుకూలమైన కమీషన్ ఏజెంట్ ఫారంపై మార్కెట్‌కు వచ్చే పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఇందులో ఒక వ్యాపారి ఆది నుంచి మార్కెట్ గేటు దగ్గర ఉండి రైతులు లోపలికి తెచ్చే ఆటో డ్రైవర్లకు పంట ఉత్పత్తుల మీద బస్తాకు మామూళ్లు ఇచ్చి తమ దుకాణానికి మళ్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రతి ఏడాది తీసుకెళ్లే కమీషన్ ఏజంట్ దుకాణానికి తరలిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్‌కు, రైతులకు మాయ మాటలు చెప్పి సదరు వ్యాపారి గేటు దగ్గర నుంచే తమ దుకాణానికి మళ్లిస్తున్నాడు. దీంతో కమీషన్ ఏజెంట్లు తమ దుకాణానికి రావల్సిన సరుకు పక్క మరో దుకాణానికి వెళ్లడంతో గొడవకు దిగుతున్నారు. కొంతమంది కమీషన్ ఏజెంట్లు పంట సాగు కోసం రైతులకు ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి ఉంటారు. చివరకు పంట మార్కెట్‌కు వచ్చే సమయంలో ఇలా మరో దుకాణానికి వెళ్లడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కార్యాలయం సమీపంలో గేటు దగ్గర కమీషన్ ఏజెంటు కాని వ్యాపారి ఇలా అక్రమంగా ఆటో డ్రైవర్లకు మామూళ్లు ఇచ్చి సరుకును తరలిస్తున్నా మిన్నకుండిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సరుకు కోసం కమీషన్ ఏజెంట్ల మధ్య ఘర్షణలు చోటు చేసుకోక ముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

వైభవంగా రుద్రహోమం, నవచంద్రిక యాగం

● పూర్ణాహుతి చేసిన మఠం పీఠాధిపతి



రుద్రహోమం నిర్వహిస్తున్న పండితులు

మంత్రాలయం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం యాగశాలలో రుద్రహోమం, నవచంద్రిక యాగం వైభవంగా నిర్వహించారు. సోమవారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన అతిరుద్ర మహాయజ్ఞ సమితి ఆధ్వర్యంలో వేదబ్రహ్మ రాజగోపాల్ ఘనపాటి, సత్యనారాయణ శాస్త్రి, చిదంబరం, బాలగంజి, కృష్ణమూర్తి భాయిరి సమక్షంలో లోక కళ్యాణార్థం రుద్రహోమం నిర్వహించారు. నవచంద్రిక యాగంలో భాగంగా హోమగుండంలోకి ధూపదీప, నైవేద్యాలు, సుగంధ ద్రవ్యాలు వేస్తూ వేదపండితుల మంత్రోచ్ఛాణాల మధ్య హోమాల నిర్వహించారు. ఈహోమాల సమితి అధ్యక్షులు సుబ్రహ్మణ్యంజోయిస్, రమేష్‌లతో పాటు 40మంది పండితులతో యాగశాల కిక్కిరిసింది. బెంగుళూరు నుంచి వచ్చిన పండితులకు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచర్, సురేష్ కోణాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, జేపీస్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, రవికులకర్ణి,తంబిస్వామి, వాజేంద్రాచార్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి నీరు వదలడం దారుణం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాయమ్మ, అభి ముబారక్, దోబి ఘాట్ కాలనీల్లో అర్ధరాత్రి కొళాయిలకు తాగునీరు వదలడం దారుణమని సీపీయం కార్యదర్శి గోవిందు, నాయకులు లక్ష్మీనరసయ్య అన్నారు. సోమవారం తాయమ్మ కాలనీ, అభి ముబారక్, దోబి ఘాట్ కాలనీలో సీపీయం నాయకులు ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు, అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అర్ధరాత్రి తాగునీరు వదలడంపై మున్సిపల్ అధికారుల తీరును దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైనా రోడ్లు, డ్రైనేజిల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆరోపించారు. అంజనేయస్వామి గుడి ముందున్న సాకిరేవు వంకపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి ఉదయం నీటి సరఫరా చేయాలని, అలాగే కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నామాల రాముడు, మాదన్న, వలి బాషా తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై ఎస్ఐ దురుసు ప్రవర్తన

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విలేకరుల పట్ల పట్టణ ఎస్ఐ శ్రీనివాసులు దురుసుగా ప్రవర్తించిన తీరు సరైందికాదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయుడబ్ల్యుజే) ఎమ్మిగనూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, తాలుకా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పరమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ భార్గవిని కలిసి ఎస్ఐ శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 25వ తేదీన జర్నలిస్ట్ తిరుమల వెంకటేష్ స్నేహితుడి ఆశోక్‌పై వేరేవ్యక్తులు దాడి చేశారని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఎస్ఐ మాట్లాడుతూ దాడి చేసినంత మాత్రాన తాము చర్యలు తీసుకోవాలా అంటూ తిరుమల వెంకటేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు భీమన్న, నూర్ అహ్మద్, మగ్భుల్, ఉస్మాన్, రామకృష్ణ, ఈరన్న, శివ, బాలాజీ, తిరుమల వెంకటేష్, ఎల్లయ్య, రవి, వెంకటేష్, లక్ష్మణ పాల్గొన్నారు.

పత్తి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేద్దాం

కౌతాళం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదోనిలో మంగళవారం జరిగే పత్తి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేద్దామని రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య తెలిపారు. కౌతాళంలో రైతు సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పత్తి రైతుల సదస్సును ఆదోని నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. రైతులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

కౌతాళం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కౌతాళంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో స్కావెంజరుగా విధులు నిర్వహిస్తున్న మాదిగ లక్ష్మిని కులం పేరుతో మానసికంగా వేధిస్తున్న పాఠశాల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏమ్మార్పీఎస్ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ ముగతి ప్రతాప్ కుమార్ మాదిగ, మండల అధ్యక్షుడు ఆనంద్‌లు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కులం పేరుతో దూషించిన వారిని ఉన్నతాధికారులు విధుల నుంచి తక్షణమే తొలగించాలని లేని సమక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, మండల విద్యాధికారి శోభారాణికు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏమార్పీఎస్ నాయకులు శంకరప్ప, తిమోతి, ఆనంద్‌లు ఉన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి గోనెగండ్ల కార్యదర్శి సతీష్, గ్రామ సర్పంచ్ హైమావతి కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈశాన్య రుతుపవనాల కారణంగా భారీ వర్షాల కురుస్తాయని వాతవరణ శాఖ ప్రకటించింది. మట్టి మిద్దెలలో రాత్రి పూట నిద్రపోవద్దని కోరా రు. మూడు రోజులు పాటు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో వీఆర్‌వోలు మునీర్‌బాషా, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే గృహాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు బీజేపీ నాయకులు గురురాజ్ దేశాయ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పీయంవై పథకం క్రింద ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలందరికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవకాశం కల్పించిందన్నారు. గృహ నిర్మాణలకు నంవబర్ 5వ తేది వరకు గడువు పెంచిందన్నారు. కావున అర్హులైన వారందరూ గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోలసిందిగా కోరారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో రామన్నగౌడు, దయాసాగర్, శివ, డానియల్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తమ వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. సోమవారం ఎర్రకోట ప్రధాన రహదారిలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆటోల్లో ప్రయాణికులను ఎక్కువగ ఎక్కించరాదన్నారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఏఎస్ఐ ప్రాణేశ్వర రావు, తుకారాము, శివప్రకాష్, మల్లయ్య, మునాఫ్‌లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ రోడ్డు బాగు చేయండి



రోడ్డుపై నిలిచిన నీటి వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

కోసిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సజ్జలగుడ్డం రోడ్డులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ రహదారి గుంతలమయమై బురదమయంగా మారడంతో నడవడానికి వీల్లేకుండా రోడ్డు ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ మల్లికార్జున, మహిళా కన్వీనర్లు రేఖా, సంగీత అన్నారు. సోమవారం మోడల్ స్కూల్ రోడ్డులో నిల్వ ఉన్న నీటి వద్ద నిలబడి నిరసన తెలియజేశారు. మెయిన్ రోడ్డునుంచి మోడల్ స్కూల్ వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాధా, అంజలి, రాణి ఆదిమూర్తి, వంశి, తేజ, శ్రీరామ్ ఉన్నారు.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలి

కోసిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని భవిష్యత్తులో జరిగే పోరాటంలో పార్టీలకు అతీతంగా ప్రజలు, రైతులు వ్యవసాయ కూలీలు కలిసి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కోసిగిలోని శ్రీసిద్దారుడ స్వామి ఆశ్రమంలో కోసిగి మండలానికి సాగు, తాగునీరు అందించి వలసలు నివారించాలని కోరుతూ సీపీఎం మండల నాయకులు వీరేష్, రాముడు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోసిగి మండలం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని రైతులకు సాగునీరు లేక వర్షాధారం మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. అలాగే ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు జరిగితే వలసలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గప్ప, రాజు, గోపాల్, నాగరాజు, వేజప్ప, నాగేంద్ర, శ్రీనివాసులు, తాయన్న, తదితరులు పాల్గొన్నారు.

5న మంత్రాలయంలో తుంగాహారతి

మంత్రాలయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో నవంబరు 5న బుధవారం తుంగాహారతి, లక్ష దీపోత్సవం, తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి తెలిపారు. నదితీరంలో వీఐపీ ఘాట్ వద్ద ప్రత్యేక వేదిక పై ప్రహ్లాదరాయలకు పూజలు చేసి పండితులు హారతులు ఇచ్చేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నూతనంగా నిర్మించిన పుష్కరిణిలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రఘు, శేఖర్, ఉదయ్ కోరారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్ సిరికు వినతి పత్రం అందజేశారు. కోచింగ్ సెంటర్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహస్తున్నారని, ఈ విషయంపై ఎంఈవో, డీఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే కోచింగ్ సెంటర్లలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నందవరం ఎస్ఐగా తిమ్మారెడ్డి

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నందవరం ఎస్ఐగా తిమ్మారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కేశవ అనంతపురం పోలీసు ట్రయినింగ్ కాలేజీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కర్నూలు 1టౌన్‌లో పనిచేస్తున్న తిమ్మారెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఎమ్మిగనూరు సీఐ జిరంజీవి, డిఎస్పీ బార్గవిని మర్యదపూర్వకంగా కలిశారు.

త్వరలో పత్తి కొనుగోలు ప్రారంభం

కోసిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీసీఐ ద్వారా త్వరలో పత్తి కొనుగోలు ప్రారంభమవుతాయనీ, రైతులందరూ పంట నమోదు చేసుకున్న తర్వాత రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదింస్తే సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. సోమవారం కోసిగిలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్ కొరకు సంబందిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని, పత్తిలో తేమ శాతం నాణ్యత సీసీఐ మార్గదర్శకాల మేర ఉంటే గరిష్ట ధర రూ.8,110 వరకు రైతులు తమ పత్తిని అమ్ముకోవచ్చని తెలిపారు.

నేడు ఆరాధనోత్సవాలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం, నందవరం గ్రామంలో రాజరాజేశ్వర దేవస్థానం, గురు బసవలింగ తాత మఠంలో గురు బసవలింగ తాత 29వ ఆరాధనోత్సవాలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు మఠం వంశస్తులు నటరాజ్, పరమేశ్వర స్వామి తెలిపారు. ఉదయం 8 గంటలకు మహా గణపతి పూజ, కలశ స్థాపన తదుపరి విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, శివలింగానికి బిల్వార్చన, అభిషేకాలు, శ్రీగురు బసవలింగ తాతగారి గద్దిగె పూజ, అభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గుర్తు తెలియమని వ్యక్తి మృతి

కోసిగి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోసిగి, కుప్పగల్ కిలోమీటరు నెంబర్ 520/14-16 ఆర్ఎస్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడని రైల్వే పోలీస్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో రైలు నుంచి జారీ పడడంతో 40 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. అయితే.. మృతి చెందిన వ్యక్తి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి



విద్యుత్‌శాఖ డీఈకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అములు చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, మాజీ అధ్యక్షులు శివశంకర్, చేనేత నాయకులు కామర్తి మిన్నప్ప, టౌన్‌బ్యాంకు వైస్‌చైర్మన్ నరసప్పలు అధికారులను కోరారు. సోమవారం విద్యుత్ కార్యాలయంలో డీఈ విజయరాజుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు చేనేతలకు 200యునిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించారన్నారు. అయితే ఎమ్మిగనూరులో 2200 మంది చేనేత కార్మికులకు అమలు కావటం లేదన్నారు. ఈ పథకాన్ని వెంటనే అమలు చేసి చేనేతకార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ చేనేత విభాగం నాయకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి కార్తీక పూజలు

మంత్రాలయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పాత ఊరిలో రామలింగేశ్వరుడికి భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకుని జంగం వీరేంద్రస్వామి, సిద్దయ్యస్వామి, జంగం సిద్దలింగయ్య, శ్రీశైలం పాలకమండలి మాజీ సభ్యులు సుజాత, ఆడిట్ శంకర్ పూజలు నిర్వహించారు.